## చెర (ప్రవాసం)

బబులోను రాజైన నెబుకద్నెజరు యూదా మీద దండయాత్రలు జరిపి యూదా ప్రజలను బందీలుగా తీసుకొని పోవడాన్ని చెర అని వర్ణించారు. నెబుకద్నెజరు క్రీ.పూ 598లో తొలి సారి యూదాపై దాడిచేసి రాజైన యెహోయాకీనును యూదా ప్రముఖుల్లో అనేకులను బబులోనుకు తీసుకొని వెళ్లాడు. యూదా రాజైన సిద్కియా బబులోనుకు వ్యతిరేకంగా తిరుగుబాట చేసినప్పుడు క్రీ.పూ.587లో మరోమారు నెబకద్నెజరు యూదాపై దాడి చేశాడు. ఈ పర్యాయం, నెబకద్నెజరు యెరూషలేం ప్రాకారాలను చిన్నాభిన్నం చేసి దేవాలయంలోని పవిత్ర ఉపకరణాలను దోచుకొని వెళ్లాడు. ఈ మారు కూడా, యెరూషలేంలోని ప్రముఖులను నిపుణులైన పనివారిని బందీలుగా తీసుకుపోయాడు.

బబులోను సామ్రాజ్యంలో అంతర్భాగమైన యూదాపై ఒక అధిపతిని నియమించాడు నెబకద్నెజరు. దావీదు వంశం నుంచి వచ్చిన రాజు ఇశ్రాయేలు సింహాసనంపై యికలేడు. క్రీ.పూ. 597లోనూ, క్రీ.పూ586లోనూ, ఆ తర్వాత క్రీ.పూ.582లోనూ బబులోను చెరలోనికి వెళ్లిన వారి నందరిని లెక్కిస్తే, వీరు దాదాపు నాలుగువలే ఆరువందల మంది (యిర్మీయా 52:28-30) బబులోను చెరలో నున్నట్లే. క్రీ.పూ.597లో చెరలోనికి వెళ్లిన వారిని మాత్రమే పరిగణనలోనికి తీసుకుంటే 2 రాజులు 24:14 ప్రకారం ఈ సంఖ్య పదివేలు.

బబులోనులో కాందిశీకులుగా వున్న యూదులు గురించి గాని, యూదాలో మిగిలివున్న వారి గురించి గాని వివరాలు అంతగా లభ్యం కావు. బబులోను వారు యూదా ప్రజలను క్రూరంగా బాధించారనడానికి కూడా ఏ ఆధారాలు లేవు. అయితే, బబులోను సంస్కృతి నుంచి మతం నుంచి తమ ఉనికిని కాపాడుకోవడంలో ఎన్నో సంఘర్షణల నెదుర్కొన్నారు. యూదుల్లో అనేకులు తమ స్వదేశమైన వాగ్దాన దేశానికి తిరిగి వెళ్ళాలని కోరుకున్నారు (కీర్తన 137). బబులోనులో విస్తృతంగా వున్న వాణిజ్యావకాశాలు మరి కొందరిని అక్కడే స్థిర పడేలా చేశాయి. వాస్తవానికి, పారసీక రాజైన కోరెషు బబులోనును స్వాధీనం చేసుకొన్న తర్వాత యూదులు తమ స్వదేశానికి తిరిగి వెళ్లవచ్చని ఆజ్ఞయిచ్చాడు. అయితే, కొందరు యూదులు బబులోనులోనే వుండి పోయిన నిదర్శనాలు కూడా వున్నాయి.

యూదా ప్రజల మీద చెర ప్రభావం మెండుగా వుంది. దేవాలయం లేని కారణంగా యాజకులు బలులు అర్పణలు అర్పించే అవకాశం లేదు. ప్రజలు చిన్న బృందాలుగా చేరి లేఖనాల అధ్యయనం ప్రార్థన వంటి కార్యక్రమాలను జరిగించుకొనేవారు. బహుశా ఈ కాలంలోనే లేఖనాలను సంకలనపరచి గ్రంథస్థం చేసి వుండవచ్చు. ఇశ్రాయేలు ప్రజలకు

యింతటి దుస్థితి ఎందుకెదురైందో లేఖనాలు వారికి స్పష్టం చేశాయి. చెర కేవలం  యాదృ ఛ్ఛికం కాదని వారు గ్రహించారు. ప్రజలు దేవునికి వ్యతిరేకంగా పాపం చేశారు గనకే, మరీ ముఖ్యంగా నేను తప్ప వేరొక దేవుడు నీకు ఉండకూడదు (నిర్గమ 20:3) అనే ఆజ్ఞను ఉల్లంఘించినందుకు దేవుడైన యెహోవా వారిని చెరలనికి పంపించాడని ప్రజలు గ్రహించారు. తమ స్వదేశానికి తిరిగి వెళ్లే సమయం ఆసన్నమైనప్పుడు (క్రీ.పూ.539) యూదా ప్రజలు (ఇక యిప్పటి నుంచి వీరిని యూదులు అని పిలిచారు) యెరూషలేం పట్టణాన్ని అందులోని దేవాలయాన్ని పునర్నిర్మించి యెహోవాతో తాము గతంలో చేసిన నిబంధనలకు లోబడి వుండడానికి సంసిద్ధులయ్యారు.